క్లుప్తంగా

ఆస్తి పన్ను చెల్లించకుంటే కుళాయి కట్



మొండి బకాయిదారుల కుళాయి కనెక్షన్ కట్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

అల్లిపురం: జీవీఎంసీ జోన్–4 పరిధి, 33వ వార్డులో ఆస్తి పన్ను వసూళ్లు జోరుగా జరుగుతున్నాయి. జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. బకాయిలు ఉన్న వారికి నోటీసులు అందజేస్తున్నారు. నోటీసులకు స్పందించని వారు, మొండి బకాయిల వసూలు కోసం బకాయిదారుల కుళాయిలు కట్ చేసినట్లు గౌరీ స్ట్రీట్ సచివాలయం ఆర్‌ఐ సీతారామయ్య, కార్యదర్శులు జయచంద్ర, కిరణ్‌కుమార్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఆస్తి పన్ను బకాయిలను మార్చి 31వ తేదీలోగా చెల్లించాలని వారు విజ్ఞప్తి చేశారు.


మహిళా కళాశాలలో అటవీ దినోత్సవం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు, విద్యార్థినులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల వృక్షశాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యత వివరించారు. అనంతరం ఫారెస్ట్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగావకాశాలు, ప్రిపరేషన్ వంటి పలు విషయాలు తెలియజేస్తూ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్ నిర్వహించారు. అడవుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఎల్. లావణ్య (ప్రథమ) షేక్ కరీముల్లా (ద్వితీయ) స్థానాలు సాధించారు. వారికి వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎంఏ నివేదిత, గ్రీన్‌క్లబ్ కన్వీనర్ డాక్టర్ జె. లావణ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, పీజీ గెస్ట్ ఫ్యాకల్టీ అంజలి, యూజీ గెస్ట్ ఫ్యాకల్టీ మహాలక్ష్మి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నవ రచయితల జాతీయ శిబిరం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ నిదేశాలయం, న్యూఢిల్లీ సౌజన్యంతో హిందీ విభాగం ఆధ్వర్యంలో 8 రోజుల నవ రచయితల శిబిరం శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా దక్షిణ భారత రాజభాషా సంస్థాన్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ విశ్రాంత హిందీ అధికారి డాక్టర్ ఎస్.కృష్ణబాబు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. భాషాభివృద్ధికి శిబిరాలు పరస్పర అనుసంధానాన్ని ప్రోత్సహించడం, కొత్త రచయితలకు ప్రచురణ అవకాశాలతో పాటు మార్గదర్శకత్వం అందించనున్నట్లు కృష్ణబాబు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, కన్వీనర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి నేతృత్వంలో భాషా సంపుటి పుస్తకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కథ, కవిత, నాటక, వ్యాస, పత్రికా రచనలు, అనువాద ప్రక్రియల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నవ రచయితల శిబిరం విద్యార్థులకు హిందీ భాషలో మరింత పట్టు సాధించడానికి తోడ్పడుతుందని కన్వీనర్ డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ నళినీదత్త, డాక్టర్ అర్చన, రామదాస్ నారాయణ, తోండే, డాక్టర్ పురుషోత్తమ్, పాటిల్, డాక్టర్ ఎస్. దీప్తి, డాక్టర్ విజయభారతి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ రోజీనా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఢిల్లీ, ఆగ్రా ప్రాంతాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

హలీం.. సలాం



నోరూరించే హలీం

అరబ్ దేశాల్లో పుట్టిన అరుదైన వంటకం

ముస్లింల కంటే హిందువుల ఆదరణే ఎక్కువంటున్న వ్యాపారులు

నగరంలో పలుచోట్ల విక్రయం

జగదాంబ: హలీం పుట్టింది అరబ్ దేశాల్లో అయినా ప్రాచుర్యం పొందింది హైదరాబాద్‌లోనే అని చెప్పాలి. నైజాం నవాబులు పవిత్ర మక్కా వెళ్లినప్పుడు హలీం తినేవారట. రంజాన్ రోజుల్లో ఉపవాస దీక్షా సమయంలో బలవర్ధక ఆహారంగా ఇవ్వడానికి ఉపయోగకరంగా ఉంటుందని ఈ వంటకాన్ని మన దేశంలో కూడా ఆరగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు గాను అరబ్ దేశాల నుంచి ప్రావీణ్యం పొందిన వారిని తీసుకొచ్చినట్లు వెల్లడవుతోంది. ఇక్కడ అలా మొదలైన ఈ వంటకం ఇప్పుడు మహా విశాఖనగరాన్ని తాకింది. గత కొన్నేళ్లుగా విశాఖలో హలీం వంటకాన్ని ముస్లింలే కాకుండా హిందువులు కూడా ఇష్టపడుతున్నారు. ఏడాదిలో నెలరోజుల పాటు దొరికే ఈ వంటకం నగరంలో జగదాంబ, డాల్ఫిన్ హోటల్ ప్రాంతాల్లో దొరుకుతోంది. పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు చేసి హలీం విక్రయిస్తున్నారు.

పోషక విలువలు మెండు..

ముస్లింలు పవిత్ర రంజాన్ మాసంలో తెల్లవారు జామున 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 14 గంటలకు పైగా ఉపవాస దీక్షలో ఉంటారు. ఆ సమయంలో ఆహారంతో పాటు ఎటువంటి ద్రవపదార్థాలు (నోటిలోని ఉమ్మి) కూడా మింగరు. ఉపవాస దీక్ష ముగించే సరికి శరీరానికి తగిన శక్తి అవసరమవుతుంది. సాధారణంగా డ్రై ఫ్రూట్స్‌తో ఉపవాస దీక్ష విరమించిన తర్వాత తీసుకునే ఆహారంలో హలీంకు ప్రాధాన్యం ఇస్తారు. హలీంలో పోషక విలువలతో పాటు తేలిగ్గా జీర్ణమయే గుణం ఉండడమే దీనికి కారణం.



డాల్ఫిన్ సెంటర్‌లోని హలీం పాయింట్

ఖద్దూ ఖీర్..

ఖద్దూ ఖీర్ రుచికరమైన స్వీట్. ఆనపకాయ, సేమియా, సగ్గుబియ్యం, పంచదారతో తయారు చేసే ఈ తియ్యని వంటకాన్ని బాగా చల్లార్చుకుని హలీం తిన్న తర్వాత తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

ఏమేం కావాలంటే..

హలీంను మటన్, చికెన్‌తో తయారు చేస్తారు. గోధుమ రవ్వ, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, ధనియాలు, సాజీరా, మిరియాలు, గసగసాలు, బాదం, పిస్తా, ఎండు గులాబీ రేకులు, జాఫ్రాన్ సోంపు, పాలు, మరింత రుచి కోసం నెయ్యి వాడతారు. నేతిలో వేయించిన ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు, పుదీనా ఆకులు హలీం రుచిని పెంపొందిస్తాయి.

తయారీ ఇలా..



తొలుత చికెన్ లేదా మటన్ ఉడకబెట్టి మెత్తటి మాంసాన్ని వేరు చేస్తారు. తగిన నెయ్యి, డాల్డా తీసుకుని గరమసాల సరుకులన్నీ వేయించాక, కడిగిన గోధుమ రవ్వను నీరు, పాలు వేసి కలుపుతారు. ఆ మిశ్రమాన్ని ఒకే ఉష్ణోగ్రతలో ఉడికిస్తారు. తర్వాత ఉడికిన మాంసం వేసి మిశ్రమాన్ని పెద్ద తెడ్డులాంటి కర్రతో రుబ్బుతారు. ఆదంతా ముద్దగా తయారై హలీంగా మారుతుంది. కోడిమాంసానికి సమయం తక్కువ పడుతుంది. మేక మాంసం అయితే సమయం ఎక్కువ పడుతుంది.

తినేవారు మెచ్చుకుంటే.. కష్టం మరిచిపోతాం..



రుచికరమైన హలీం తయారీకి కసరత్తు చేయాలి. మాంసంలో 14 రకాల మాషాలాలు, గోధుమలు కలిపి ఈ వంటకం తయారు చేస్తాం. తయారీకి ఎంత కష్ట పడినా హలీం ప్రియులు ఆస్వాదిస్తున్నప్పుడు ఆ కష్టం మరిచిపోతాం.
– జుబేర్, జగదాంబ హలీం పాయింట్ యాజమాని

నాణ్యతలో రాజీలేదు..



హలీం తయారీలో రాజీ పడం. హైదరాబాద్ నుంచి ప్రత్యేక నిపుణులను తీసుకొచ్చి తయారు చేయిస్తాం. హలీంలో వేసే దినుసుల నుంచి నెయ్యి వరకు ఎక్కడా రాజీ లేకుండా తయారు చేస్తాం.
– భాషీ, డాల్ఫిన్ ఏరియా హలీం పాయింట్ యాజమాని

భద్రాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని విశాఖ నుంచి భద్రాచలానికి ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు విశాఖ ద్వారకా బస్టేషన్ నుంచి వయా రాజమండ్రి మీదుగా భద్రాచలానికి ఏప్రిల్ 5 ఉదయం 6 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయలు దేరుతాయని తెలిపారు. ప్రయాణికులు, భక్తులు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని విశాఖ నగర వాసులు వినియోగించుకొని సీతారాముల కల్యాణం, శ్రీరామనవమి వేడుకలు నేరుగా భద్రాచలంలో వీక్షించి ఆ స్వామి ఆశీస్సులు పొందగలరని కోరారు.

మధురవాడ డిపో తనిఖీ..

జిల్లా ప్రజారవాణా అధికారి బి.అప్పలనాయుడు శుక్రవారం మధుర వాడ డిపోను తనిఖీ చేశారు. డిపోలో బస్సులు పెరుగుతున్న దృష్ట్యా సిబ్బంది మరింత చురుగ్గా పని చేయాలని, ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీస్ చేయాలని సూచించారు. ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముందుగా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకుని వెళ్లాలని, అందుకు సిబ్బంది సహకారం ముఖ్యమన్నారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలానికి ప్రత్యేక సర్వీసు లు నడుపుతున్నామని, మరిన్ని వివరాలకు 9552300009 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ రాజేశ్వరి, ట్రాఫిక్ ఇంజినీర్ దుర్యోధన, రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణదారులు ఐక్యంగా పోరాడాలి



సంఘం ద్వైవార్షిక మహాసభలో మాట్లాడుతున్న ఆచార్య బాల మోహన్‌దాస్

దాబాగార్డెన్స్: ఇండియన్ బ్యాంక్ పదవీ విరమణదారుల సంఘం 13వ ద్వైవార్షిక మహాసభ, రజతోత్సవ సభ శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ మాజీ వైస్ చాన్సలర్ వి.బాలమోహన్‌దాస్ పాల్గొని మాట్లాడారు. అఖిల భారత బ్యాంకు పదవీ విరమణదారుల సమాఖ్య అధ్యక్షుడు ఎస్ఎం దేశ్ పాండే, తెలంగాణ రాష్ట్ర బ్యాంకు పదవీ విరమణదారుల సమాఖ్య అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ బ్యాంకు పదవీ విరమణదారుల సమాఖ్య అధ్యక్షుడు బీవీవీ కొండలరావు పాల్గొని బ్యాంకు పదవీ విరమణదారులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు వివరించారు. పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధనకు నిర్వహించే ఉద్యమాల్లో పదవీ విరమణదారులు ఐక్యంగా పాల్గొనాలని కోరారు. ఇండియన్ బ్యాంకు రిటైరీల అసోసియేషన్‌కు భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ)తో నేరుగా చర్చించే హక్కు లేదని, కాబట్టి ఈ మహాసభ పదవీ విరమణదారుల సంఘానికి నేరుగా చర్చించే అధికారాన్ని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పింఛన్ అప్‌డేషన్ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు, రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులు పొందుతున్న విధంగా బ్యాంకు ఉద్యోగులకు మంజూరు చేయాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తోందన్నారు. 1986లో బ్యాంకు ఉద్యోగులకు పింఛన్ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు బేసిక్ పింఛన్ అప్‌డేట్ చేయలేదన్నారు. కానీ ప్రభుత్వ ఉద్యోగులు, రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులు ప్రతి వేతన ఒప్పందంతో పింఛన్ అప్‌డేషన్ పొందుతున్నారని చెప్పారు. ఆరోగ్య బీమా ప్రీమియం మొత్తం బ్యాంకులే భరించాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తోందన్నారు. బ్యాంకు పదవీ విరమణదారుల డిమాండ్లు వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోయిన బ్యాగు అందజేసిన పోలీసులు



ఆశిష్‌పాల్‌కు బ్యాగు అందజేస్తున్న సీఐ యర్రంనాయుడు తదితరులు

అల్లిపురం: దొంగతనానికి గురైన బ్యాగును టూటౌన్ పోలీసులు కనుగొని బాధితునికి అందజేశారు. సీఐ వీవీసీఎస్ యర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన ఆశిష్‌కుమార్ పాల్ గీతం కళాశాలలో ఇంజినీరింగ్ చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం అతను సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఆ సమయంలో ప్లాట్‌ఫారంపై నిల్చున్న అతని వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తి బ్యాగు తస్కరించాడు. దీంతో అతను ఉదయం నుంచి సాయంత్రం వరకు వెతికినా బ్యాగు ఆచూకీ తెలియరాలేదు. ఈ నేపథ్యంలో టూటౌన్ కానిస్టేబుల్ చావులమదుం జంక్షన్ వద్ద బీట్ చూస్తుండగా ఒక బడ్డీ వద్ద అనుమానాస్పదంగా ఒక నీలం రంగు బ్యాగు కనిపించింది. దానిని పరిశీలించిన ఆయన చుట్టుపక్కల ఎవరిని అడిగినా బ్యాగు ఎవరిదన్నది తెలియలేదు. దీంతో బ్యాగు తనిఖీ చేయగా బ్యాగులో ఒక ల్యాప్‌టాప్, మొబైల్, వాచ్, సర్టిఫికెట్లు, ఐడీ కార్డులు ఉన్నాయి. దీంతో పోలీసులు గీతం కళాశాలకు ఫోన్ చేసి అతని డిటైల్స్ తీసుకుని అతనికి ఫోన్ చేశారు. దీంతో అతను టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. అతనికి సీఐ యర్రంనాయుడు, కానిస్టేబుల్ రామచంద్రతో కలిసి బ్యాగును ఆశిష్‌కుమార్‌పాల్‌కు అందజేశారు. దీంతో ఆశిష్‌కుమార్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. తను ఎంతో కష్టపడి చదువుకుని సంపాదించిన సర్టిఫికెట్లను తనకు భద్రంగా అందించినందుకు ధన్యవాదాలు తెలిపాడు.

ముగిసిన రెండు రోజుల వర్క్‌షాప్



వర్క్‌షాప్ ముగింపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అకడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. కళాశాల రసాయనశాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన రెండో రోజు వర్క్‌షాప్‌లో 'న్యూ ఫ్రాంటైర్స్ ఇన్ కెమికల్ సైన్స్'అంశంపై సైన్స్ అకడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. వర్క్‌షాప్ నిర్వహించడానికి అనుమతి లభించినందుకు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్‌షాపు విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధనలకు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్ 'ఆర్గానిక్ సింథసిస్', ప్రొఫెసర్ రాజకుమార్ బల్లా 'స్పెక్ట్రోస్కోపిక్ టూల్స్', ప్రొఫెసర్ బీఎల్‌వీ ప్రసాద్ 'నానోపార్టికల్స్' అంశాలపై నూతన ఆవిష్కరణలు విద్యార్థినులకు విశదీకరించారు. ఈ నేపథ్యంలో ఐఐఎస్‌సీ బెంగళూరు నుంచి వచ్చిన ఆచార్యులు ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్, ప్రొఫెసర్ రాజకుమార్ బల్లా, ప్రొఫెసర్ బీఎల్‌వీ ప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. కల్యాణ్‌రామ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలివ్వాలి



సమావేశమైన ఉద్యోగులు, పెన్షనర్లు

దాబాగార్డెన్స్: గ్రంథాలయ సిబ్బంది చిరకాలంగా కోరుతున్న 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల అకౌంట్‌కు జమ చేయలని, గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి గ్రాంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వివిధ తీర్మానాలు ఆమోదించింది. అనంతరం తూర్పుగోదావరి జిల్లాతో కలుపుకుని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. మల్లేశ్వరరావు కన్వీనర్‌గా మరో 10 మందితో కమిటీ ఏర్పాటైంది. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలాది సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునికీకరిస్తామని గ్రంథాలయాలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ నాయకుడు బి. ఆనందరావు, శ్రీకాకుళం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైకుంఠరావు, విజయనగరం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామభద్రరాజు, విశాఖ, విజయనగరం జిల్లాల గ్రంథాలయ సంఘాల అధ్యక్షుడు ఆనందరావు, కె. శ్రీనివాసరావు వివిధ సమస్యలపై మాట్లాడారు. విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తూర్పు గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక మంది గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


గడువులోగా ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి చేయాలి



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగే అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆయన ప్రోగ్రామ్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కుటుంబ సంక్షేమ శాఖ, మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, మాతా, శిశు మరణాల రేటు తగ్గింపు, గర్భిణులకు మందుల వినియోగం, ఇతర అంశాలపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఏఎస్ఎంలు ఎన్‌రోల్‌మెంట్ కరెక్ట్‌గా చేయాలని, వైద్యాధికారులు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది సమయానికి ముఖ హాజరు వేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు. అదే విధంగా పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ జూమ్ సమావేశంలో జిల్లాలో గల ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయ వసతి గృహంలో ఇద్దరికి ఆశ్రయం



యువతిని షెల్టర్ హోంకు తీసుకొచ్చిన పోలీసులు


సీతమ్మధార: బాగా చదవటం లేదని, తక్కువ మార్కులు వస్తున్నాయని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైలు ఎక్కి విశాఖపట్నం వచ్చిన తమిళనాడుకు చెందిన రమ్య (18)కు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. ఆమె ఇంటర్ చదువుతోంది. విశాఖ రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా తిరుగుతుండగా ఆమెను గుర్తించి ఏయూటీడీకి అప్పగించారు.

షెల్టర్ హోంకు అభాగ్యుడు..

సారవకోటకు చెందిన చొప్పల రాము (49) తాపీ మేస్త్రీ. అతనికి తాగుడు అలవాటు ఉండడం వల్ల భార్యాపిల్లల్ని చిత్రహింసలు పెట్టే వాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని పట్టించుకోవడం మానేశారు. అతన్ని గతంలో గుర్తించి షెల్టర్ హోంకు తీసుకొచ్చారు. తర్వాత అతను ఒక హోటల్లో పని చేస్తూ జీవించేవాడు. తర్వాత అతని కాలు విరిగిపోవడంతో పనికి వెళ్లలేక ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో బిచ్చమెత్తుకుంటూ జీవిస్తుండగా షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు.

విక్టోరియా ఆస్పత్రికి ఆధునాతన పరికరాలు

రూ.50 లక్షలతో సమకూర్చిన సౌత్ ఆసియా ఎల్‌పీజీ




డాక్టర్ ఉషాప్రసాద్‌కు ఒప్పంద పత్రాలు అందిస్తున్న సౌత్ ఆసియా ఎల్‌పీజీ కంపెనీ సీఈవో నవీన్

మహారాణిపేట: విక్టోరియా ప్రభుత్వ ఆస్పత్రికి రూ.50 లక్షల విలువైన వైద్య పరికరాలను సౌత్ ఆసియా ఎల్‌పీజీ కంపెనీ సమకూర్చింది. ఈ పరికరాలను శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్‌కు కంపెనీ సీఈవో అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నవీన్ అందజేశారు. సీఎస్సార్‌లో భాగంగా ఈ పరికరాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆస్పత్రి డాక్టర్ జీవన్ సంతోష్ కుమార్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు రూ.6 లక్షలు పరిహారం

విశాఖ సిటీ: రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ముగ్గురు బాధితులకు రూ.6 లక్షల పరిహారం అందజేశారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందజేస్తున్నారు. ఇదే తరహాలో ఇటీవల హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన మల్లిపాటి సూర్యనారాయణ, పైల సూరిబాబు, కొట్యాడ సూర్యప్రభ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాలోకి జమ చేశారు. అవసరమైన సహాయం కోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉన్న రోడ్డు ప్రమాద బాధిత సహాయక కేంద్రానికి వచ్చి గానీ లేదా టోల్ ఫ్రీ నంబర్ 7995095793 నంబర్‌లో గాని సంప్రదించాలని సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు.

నేటి నుంచి ఆది మహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర



మాట్లాడుతున్న అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ జాతీయ కార్యదర్శి చాండ్‌మాల్ అగర్వాల్

మహారాణిపేట: లోక కల్యాణార్థం ఆది మహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ జాతీయ కార్యదర్శి, యాత్ర దక్షిణ భారత సమన్వయకర్త చాండ్ మాల్ అగర్వాల్ తెలిపారు. రాజస్థాన్ సాంస్కృతిక మండల్ భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ యాత్ర వివరాలను వెల్లడించారు. విశాఖ నగరం నుంచి శనివారం ఈ యాత్ర మొదలవుతుందని, ఏప్రిల్ 4వ తేదీ వరకు మొదటి దశలో 12 రోజులు, ఏప్రిల్ 21 నుంచి 26వ తేదీ వరకు ఆరు రోజులు మొత్తం 18 రోజుల పాటు రాష్ట్రంలో జన్ ఆశీర్వాద్ యాత్ర కొనసాగుతుందని వివరించారు. రాజస్థాన్ సాంస్కృతిక మండల్ భవనంలో ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం యాత్ర మొదలవుతుందని తెలిపారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో విశాఖలో, 25 నుంచి 28 వరకు విజయనగరం, శ్రీకాకుళంలో యాత్ర నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం కాకినాడ, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, కర్నూలు, శ్రీశైలం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, రేణిగుంట మీదుగా చెన్నై చేరుకుంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, గోవా, అండమాన్ నికోబార్ దీవుల్లో 90 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందని వివరించారు. మొట్టమొదటి ఆది మహాలక్ష్మి, అష్టలక్ష్మి అమ్మ ఆలయాన్ని హర్యానాలోని అగ్రోహాలో నిర్మిస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. సమ్మేళన్ ప్రతినిధులు సమాన్ ప్రకాష్ సరావాగీ, వినీత్ లోహియా, దీపక్ కన్సారియా, సంజయ్ సుమన్, టిక్ మనీ, బీజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కలిగిన ఇద్దరి అరెస్ట్

అల్లిపురం: అక్రమంగా మద్యం కలిగి, వాటిని విక్రయిస్తున్న ఒక మహిళ సహా ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక దుకాణంలో గుట్టుగా మద్యం విక్రయిస్తున్న చింతపల్లి అప్పలనాయుడు, చింతపల్లి అప్పలకొండలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల దగ్గర నుంచి రూ.5,372 విలువ గల 180 ఎంఎల్ బెంగళూరు విస్కీ బాటిళ్లు 23, 180 ఎంఎల్ కేరళ మాల్టెడ్ ఫైన్ విస్కీ 5, 180 ఎంఎల్ మంజీరా బ్లూ ప్రీమియమ్ విస్కీ 20 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.